ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023 | 5 | అనంతపురం



లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిద్దాం : డిఐజి

అనంతపురం : ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వయంతో పనిచేసి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిఐజి రవిప్రకాష్ పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల సిఐలు, ఆపై స్థాయి పోలీసు అధికారులతో గురువారం నాడు ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రాజీమార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాల వారికి తెలియజేసి లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు అధికారులు కేసుల తగ్గింపు నిమిత్తం సంబంధిత న్యాయమూర్తులతో సంప్రదించి పెండింగ్ కేసులను తగ్గించేలా కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రానున్న రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుగ్గా పని చేయాలన్నారు. నిరంతర నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు రెండు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు ఇసుక రీచ్ వద్ద నిరసన తెలుపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు ఇసుక రీచ్ వద్ద హైడ్రామా

తవ్వకాలకు అనుమతి లేదంటూ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆందోళన
అడ్డుకున్న పోలీసులు - జెసిపిఆర్ అరెస్టు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరు ఇసుక రీచ్ వద్ద గురువారం నాడు హైడ్రామా నెలకొంది. గ్రామ సమీపంలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదంటూ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో ఆందోళన చేపట్టారు. రీచ్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు పోలీసులు ప్రభాకర్‌రెడ్డికి తెలిపారు. అక్రమంగా ఇసుక రీచ్ నిర్వహిస్తుంటే పోలీసులు, గనులశాఖ అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రభాకర్ రెడ్డి పోలీసులతో వాదనకు దిగారు. ఇసుక రీచ్ అనుమతులు ఉంటే చూపాలని లేని పక్షంలో జెసిబిలను టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని పట్టుబట్టారు. ఇదే విషయంపై పోలీసులు జెసిపిఆర్ మధ్య తీవ్ర వాదన నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు ప్రభాకర్‌రెడ్డిని బలవంతంగా జీపులో ఎక్కించుకుని శింగనమల వైపు తీసుకెళ్లారు. జెసి అనుచరులు వారి వాహనాల్లో పోలీస్ జీప్‌ను అనుసరించారు. మార్గమధ్యంలో పోలీసులు వారిని అడ్డుకుని పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత జెసి.ప్రభాకర్ రెడ్డిని కూడా పోలీసులు పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆయనపై కేసు నమోదు చేసి, అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి పోలీసు స్టేషన్‌లో ఉన్న సమయంలో ఆయన అనుచరులు స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఓ వైపు ఆందోళన జరుగుతున్నా ఇసుక రీచ్ యథావిధిగా కొనసాగింది.

మోగిన మండలి నగారా



- ◆ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు షెడ్యూల్
- ◆ ఫిబ్రవరి 16న నోటిఫికేషన్
- ◆ మార్చి 13న ఎన్నికలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యుల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29వ తేదీ నాటికి ఇప్పుడున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం పూర్తవనుంది. ఇప్పటికే ఈ రెండు స్థానాలకు పోటీపడే వారు రంగంలోకి దిగారు. ఎన్నిలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే అవుత్సాహిక అభ్యర్థులు ఓటర్ల నమోదులో క్రియాశీలకంగా పనిచేస్తూనే ప్రచారాలు చేసుకునే పనిలోనున్నారు. ఇప్పుడు అధికారికంగా ఎన్నికల సంఘం షెడ్యుల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల వేడి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫిబ్రవరి 16న నోటిఫికేషన్, మార్చి 13న ఎన్నికలు

అనంతపురం, కర్నూలు, కడప పాత జిల్లాలు కలిపి రాయలసీమ పశ్చిమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాలకు ఇప్పుడు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యుల్ ప్రకారం ఫిబ్రవరి 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫిబ్రవరి 23వ తేదీన నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుంది. ఫిబ్రవరి 24వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. ఫిబ్రవరి 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆ తరువాత ప్రచారాలకు సమయం ఉంటుంది. మార్చి 13వ తేదీన పోలింగ్ జరుగుతుంది. మార్చి16వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది.

ఇప్పటికే ప్రధాన అభ్యర్థులు రంగంలోకి...

ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు నుంచే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను సైతం ప్రకటించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు ఉన్నారు. ఆయనకు వామపక్ష పార్టీలతో పాటు ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. మూడు జిల్లాల్లోనూ ఆయన విజయాన్ని కాంక్షిస్తూ అందరూ కృషిచేస్తున్నారు. ఇక అధికార వైసిపి నుంచి ఇప్పుడున్న ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి కుమారుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని బరిలో దింపారు. ప్రతిపక్ష టిడిపి నుంచి కడప జిల్లాకు చెందిన రామ్‌గోపాల్‌రెడ్డి పేరు ఖరారు చేశారు. వీరుకాకుండా మరికొంత మంది స్వతంత్రంగా బరిలో దింగేందుకు సిద్ధమై ఉన్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ఎమ్మెల్సీగానున్న కత్తి నరసింహారెడ్డి మరోమారు బరిలో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఆయనకు ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు ఉంది. ఆయన కాకుండా ఇతర నేతలు బరిలో దిగడమే కాకుండా ఉపాధ్యాయులకు తాయిలాల ద్వారా ఎరవేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. జిల్లాలో టిఫిన్ బాక్సులను పంపిణీ చేయడం బహిర్గతం కావడం జరిగింది.



బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘాల నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై రైతుసంఘాల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ సంక్షోభానికి పరిస్కారాలు చూపని కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అనంతపురంలో గురువారం నాడు కేంద్రప్రభుత్వ కార్యాలయాలు బిఎస్ఎన్ఎల్, పోస్ట్‌ఆఫీస్ ఎదుట రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి నాయకులు ఇండ్ల ప్రభాకర రెడ్డి, సి.మల్లికార్జున, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, క్రిష్టమూర్తి, బాలరంగయ్య మాట్లాడుతూ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఏ రకంగా రెట్టింపు అవుతుందని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి వ్యవసాయాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. ఓ పక్క లక్షలాది మంది రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్న ఆదుకోవాల్సిన కేంద్రం మరింత ఇబ్బందులకు గురి చేసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఎరువులపై సబ్సిడీ గతం కంటే 50 వేల కోట్ల తగ్గించడం దుర్మార్గం అన్నారు. ఉపాది హామీ పథకానికి నిధులు పెంచకుండా నిర్వీర్యం చేసేలా కేంద్రం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాలన సాగిస్తున్న బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయకార్మిక సంఘాల నాయకులు బిహెచ్.రాయుడు, మనోహర్, రాయుడు, శ్రీకాంత్, చంద్రశేఖర్, కరీం, చిన్నా, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

రైతు, కార్మిక, కర్షక, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీల, మధ్యతరగతి వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రశ్నించే గొంతుకగా పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించుకుందామని పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. అనంతపురం రామ్‌నగర్ యాదవ కళ్యాణమండపంలో గురువారం సాయంత్రం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సూర్యుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.రాంభూపాల్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జాఫర్, పాళ్యం నారాయణస్వామి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాలు భయాందోళనకు గురువుతున్నారని తెలిపారు. ఉద్యోగులకు 1వ తేదీ వేతనాలు వచ్చే రోజులు పోయి 10వ తేదీ వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. ఫేస్‌యాప్ హాజరంటూ తీవ్ర ఆందోళనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నెట్టివేయబడ్డారని తెలిపారు. ఇలాగే ప్రభుత్వ పాలనా విధానాలు కొనసాగితే అభ్యుదయ భావాలతో మెలుగుతున్న ప్రజాస్వామ్యం కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. కనీసం హక్కులను అడిగే స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం కరపత్రాలు కూడా పంపిణి చేయనివ్వని ప్రభుత్వం అధికార పార్టీ మద్దతుదారులు పాఠశాలల్లో టిఫిన్ బాక్సులు పంపిణీ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నియంతృత్వ విధానాలు అమలు జరుగుతున్న పరిస్థితుల్లో ప్రజా గొంతుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ఎంతటి చర్యలకైనా దిగజారే ప్రమాదం ఉందన్నారు. వాటి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వి.రామిరెడ్డి, ఆర్వి.నాయుడు, వెంకట నారాయణ, ఎఐటియుసి జిల్లా నాయకులు శ్రీరాములు, లింగమయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఏఐఎస్ఎఫ్ఐ కుళ్ళాయిస్వామి, డిఐవైఎఫ్ రాజేష్ పాల్గొన్నారు.

పప్పుశనగ క్వింటా రూ.6వేలకు కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో 1.90లక్షల ఎకరాల్లో పండిన పప్పుశనగ పంటను క్వింటా రూ.6వేల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం పప్పుశనగ దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర మాత్రం గిట్టుబాటు లేదన్నారు. గత 15 రోజుల నుంచి పప్పుశనగ కోతల ప్రారంభం అవగా, ప్రభుత్వ కోనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతుల అవసరాలను దళారీలు సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. క్వింటాకు రూ.4500 మించి కొనుగోలు చేయడం లేదన్నారు. పంట సాగు నిమిత్తం పెట్టుబడి ఖర్చులు, కౌలు ధరలు కూడా అధికంగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో క్వింటా ధర కనీసం రూ6వేల మేరకైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులకు ఊరట కలుగుతుందని చెప్పారు. గత సంవత్సరం కొనుగోలు చేసిన వాటికి సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించి శనగ రైతులకు న్యాయం చేయాలని కోరారు.

గత జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వాల్సిందే

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి గత జిఒల ప్రకారం మినిమం టైం స్కేల్‌కు సమానంగా వేతనాలు పెంపుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడున్నర సంవత్సరాలలో జారీ చేసిన జీవోలు 24, 40, 5 ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా కేవలం 23 శాతం జీతం పెంచడం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒల ప్రకారం వేతనాలు పెంచుతుందని ఎదురు చూస్తున్న తరుణంలో ఇచ్చిన జిఒలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మడమ తిప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా కెజిబివి ఉద్యోగుల వేతనాలపై జారీ చేసిన జిఒల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మినిమం టైంస్కేల్స్ అమలు చేయాలని కోరారు. కెజిబివిలోని అన్ని క్యాడర్లు, సమగ్రశిక్షలోని అన్ని క్యాడర్లకు వేతనం పెంపును వెంటనే అమలు చేయాలని కోరారు. జిఒల అమలు కోసం కెజిబివి ఉద్యోగులు, సమగ్రశిక్ష ఉద్యోగులు నిర్వహించే అన్ని ఆందోళనలకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ఆహార పంటలలో జన్యు మార్పిడి ప్రమాదం

ప్రకృతిసిద్ధమైన ఆహార పదార్థాల మార్పును ఆపుదాం
జాతీయ ఆహార భద్రత దినోత్సవ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆహార పంటలలో జన్యు మార్పిడితో మానవాళికి పెను ప్రమాదం కలుగుతుందని, ఈ చర్యలను సమిష్టిగా అడ్డుకుందామని పలువురు వక్తలు అన్నారు. గురువారం ఎన్జీవో హోంలో రైతు స్వరాజ్య వేదిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ, వినియోగదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రైతు స్వరాజ్య వేదిక నాయకురాలు భానుజా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కెవి.రమణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు హాజరై మాట్లాడుతూ ఇటీవల జన్యు మార్పిడి ఆవ పంటకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఆహార పంటలలో జన్యు మార్పిడి ప్రమాదం మళ్ళీ మన ముందుకి వచ్చిందన్నారు. జన్యు మార్పిడి పంటలపై దేశమంతటా అన్ని వర్గాల ప్రజలు తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జన్యు మార్పిడి ఆహార పంటల వల్ల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రైతుల చేతి నుంచి విత్తనాలు పేటెంట్ల ద్వారా బహుళ జాతి కంపెనీల చేతిలోకి వెళ్ళిపోవడం వంటి దుస్తితి ఏర్పడుతుందన్నారు. ప్రతి రోజు వంటలో తప్పనిసరిగా వినియోగించే ఆవాలు ఇప్పుడు విషపూరితం కాబోతున్నాయని తెలిపారు. ప్రకతి విరుద్ధంగా ఒక జీవ జాతి నుంచి జన్యవును తీసుకొని మరొక జీవ జాతి లోకి పంపడం అనేది ఒక ప్రక్రియ అన్నారు. ఇటువంటి ఆహారం తినడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం వుంటుందన్నారు. జన్యు మార్పిడీ పంట అయిన బీటీ పత్తి పొలంలో మేసిన గొర్రెలు చనిపోవడంతో బిటి పత్తి ఆకులను మేపవద్దని ప్రభుత్వమే హెచ్చరికలు జారీ చేసింది గుర్తు చేశారు. మరి ఇప్పుడు జన్యు మార్పిడి ఆవ పంటను అనుమతించడం కార్పొరేట్ కంపెనీలకు ప్రోత్సహించడానికా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు హాని కలిగించే జన్యు మార్పిడి నిర్మూలించాలన్నారు. ప్రజలను చైతన్యం తీసుకొచ్చేందుకు ఫిబ్రవరి 09 నుంచి 15 వ తేది వరకు గ్రామ స్థాయి నుంచి వినియోగదారులందరితో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్, ఎంపీలకు వినతి పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహనా సదస్సులు, సంతకాల సేకరణ, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయండి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరంలో జరుగుతున్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులకు నగర మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని 37వ డివిజన్ పరిధిలో రూ.40 లక్షలతో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను మేయర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన, నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని సూచించారు. అనంతరం ఆయన 32వ డివిజన్ పరిధిలోని ఆదర్శ నగర్ 46 సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను అందించాలని సూచించారు. ఆదర్శ నగర్‌లోని అంగన్‌వాడీ స్కూల్‌ను తనిఖీ చేసి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11, 12న జెవివి అధ్యయన తరగతులు

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో గుత్తిలోని సాయి డిగ్రీ కళాశాలలో జెవివి శాస్త్ర అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.భాస్కర్, కే.లక్ష్మీనారాయణ తెలిపారు. విశ్వ ఆవిర్భావం, జీవ పరిణామం, సమాజ పరిణామం- లాంటి అంశాలపై ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్ర ప్రచారం, మెథడ్ ఆఫ్ సైన్స్, ప్రకృతి సూత్రాలు- తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయని, విద్యా, వైద్య పర్యావరణ రంగాలు చేయాల్సిన కార్యక్రమాలపై చర్చ ఉంటుందన్నారు. ప్రజలలో పెరుగుతున్న అశాస్త్రీయ భావాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. గుత్తిలో 11వ తేదీ ఉదయం 10:30 గంటలకు సాయి డిగ్రీ కాలేజీలో జరిగే ప్రారంభ సభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రక్త దాతల స్ఫూర్తి ప్రదాత తరిమెల అమర్‌నాథ్ రెడ్డి, జెవివి మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రంగన్న, శ్రీసత్యసాయి జిల్లా జెవివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బిటి.రామ్మూర్తి, డాక్టర్ ఆదిశేషు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. జెవివి కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు ఈ క్లాసుల్లో పాల్గొంటారని తెలిపారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌కు అనుమతులివ్వడంపై పోరాడుతాం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన అనంతపురంలో రోడ్లు భవనాలు శాఖ అతిగృహంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్నంత కాలమూ అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు, అనుమతులు రాలేదన్నారు. 2010లో కృష్ణా వాటర్ 9 టిఎంసిలను కేటాయించారు. 2011లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చిందన్నారు. ఈ రోజుకు కూడా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేటాయింపులు లేవన్నారు. పట్టిసీమ డైవర్షన్ ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించారనే సాకుతో తమ రాష్ట్రానికి అదనంగా 25 టిఎంసిల నీటిని కేటాయించాలనే వాదనను తీసుకొచ్చిన కర్నాటక రాష్ట్రం ఆనీటిని కూడా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి డీపీఆర్ పొందుపరిచింది. 2017లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే కర్నాటక ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్ట్ కోసం స్టేజ్ 2 ఫారెస్ట్ క్లియరెన్స్‌కు అనుమతులు తెచ్చుకుందన్నారు. అలాగే స్టేజ్ 2 ఎక్స్‌ప్యాన్సన్‌కు కూడా అనుమతులు తీసుకున్నారన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదన్నారు. అభ్యంతరం చెప్పలేదన్నారు.చంద్రబాబు నిస్సహాయత వల్లే కర్నాటక రాష్ట్రం అనేక ప్రాజెక్టులను పూర్తి చేసుకుందన్నారు. ఈ పాపానికి చంద్రబాబును జైల్లో పెట్టడమా, ఉరి తీయడమో ఏది కరెక్టో ప్రజలే చెప్పాలన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బొమ్మన శ్రీరామ్‌రెడ్డి

ఆధార్ సెంటర్ ప్రారంభం

శింగనమల : శింగనమల మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో నూతన ఆధార్ సెంటర్‌ని డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి గురువారం ప్రారంభించారు. ప్రజలందరూ నూతన ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

రాయదుర్గం : మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సిఐ యుగంధర్, ఎస్ఐ సుమన్, ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీ బజార్ పెట్రోల్ బంకు సర్కిల్ నందు మానవహారంగా ఏర్పడి వెట్టిచాకిరీ విధానాన్ని రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. రాధాకృష్ణ హై స్కూల్ ఉపాధ్యాయుడు నాగభూషణం ప్రతిజ్ఞను చదివి వినిపించారు. విద్యార్థులలో పాటు అధికారులు సైతం ప్రతిజ్ఞ చేస్తూ వెట్టిచాకిరీ నిర్మూలనకు నాంది పలకాలి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పుట్లూరుకు
ఆలూరు సాంబశివారెడ్డి రాక

ప్రజాశక్తి-పుట్లూరు

మండలం నాయకునిపల్లి వనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొననున్నట్లు ఎంపీపీ రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కన్వీనర్, జెడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన సదస్సు

నార్పల : పోషకాహార లోపం ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు, అంగన్‌వాడీలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు ఇవ్వాల్సిన ఆహారానికి సంబంధించిన పట్టికను తల్లిదండ్రులకు అందజేశారు. పౌష్టికాహారాన్ని ఎలా తయారుచేసుకోవాలి, చిన్నారులకు ఎలా తినిపించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ ఉమా శంకరమ్మ జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, మధుమాలిని, ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు రేణుక, శ్రీదేవి, పార్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ విక్రయించాలంటే
పేర్లు నమోదు తప్పనిసరి

పుట్లూరు : ప్రభుత్వానికి పప్పుశనగ విక్రయించాలనుకున్న రైతులు కచ్చితంగా వారి పేర్లు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో కాత్యాయని తెలిపారు. పప్పుశనగకు క్వింటాల్ రూ.5335గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పప్పుశనగను ఏపీ మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పెద్దపప్పూరు : స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐరన్ మాత్రలు అందజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి భారతి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, లక్ష్మికుమారి, నాగరత్న, స్టాఫ్‌నర్స్ ఆదిలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని మడుగుపల్లి, ఎల్లుట్ల, మడ్డిపల్లి, కుమ్మనమల గ్రామ సచివాలయాలను ఎంపీడీవో యోగానందరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం జెఆర్.పేట, ఎల్లుట్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లను ఆయన సందర్శించారు. మడుగుపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గర్భిణులు, 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు, యుక్త వయస్సు మహిళల వివరాలను వెల్ఫేర్ అసిస్టెంట్లు యాప్‌లో నమోదు చేయడాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గం : పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం పార్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున సమక్షంలో పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా కోట్రేష్, సహాయక కార్యదర్శులుగా అయేషా లను ఎన్నుకున్నారు.

నేడు ప్రయివేటు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు అంజి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం నగరంలో రెండు రోజుల క్రితం నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తుండడంతో విద్యార్థి కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. దీనికి కారణమైన నారాయణ కళాశాలను సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల విద్యార్థులను, తల్లిదండ్రులను ఫీజుల కోసం వేధిస్తున్నారన్నారు. ఫీజు మొత్తం చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని భయపెడుతున్నారన్నారు. నారాయణ కళాశాలకు వత్తాసుగా పనిచేస్తున్న జిల్లా ఆర్ఐఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నారాయణ విద్యాసంస్థల్లో జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నారాయణ కళాశాలను సీజ్ చేసి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగే కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బంద్‌కి అందరూ సహకరించి జయప్రదదం చేయాలని కోరారు.

గుత్తి : నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ. రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం జరిగింది. శుక్రవారం చేపట్టిన కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గౌతమ్, నాయక్ అధ్యక్షులు కృష్ణ, నాయకులు రవి నాయక్, రంగస్వామి, దర్శన్, రమేష్ రెడ్డి, షబ్బీర్, బాషా తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జెడ్.వీరారెడ్డి కాలనీ సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్



తహశీల్దారుకు వినతి చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. పేదల నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలని తహశీల్దారు ఎస్.మహబూబ్ బాషాకు సిపిఎం నాయకులు గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఈనెల 1, 2 తేదీల్లో సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద పేదలకు ఇళ్ల పట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 38 గంటల సత్యాగ్రహ దీక్షలు చేపట్టామన్నారు. దీక్షలకు స్పందించిన రెవెన్యూ ఉన్నతాధికారులు సిపిఎం నాయకులతో చర్చించి జిల్లా వ్యాప్తంగా అన్ని తహశీల్దారు కార్యాలయాల వద్ద ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించి పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. దీంతో రెవెన్యూ బృందాన్ని ఏర్పాటు చేసి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తహశ్ళీల్దార్ మహబూబ్ బాషా హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, వి.నిర్మల, సి.రమేష్, యు.మల్లికార్జున, ఎస్.మున్ని, ఆర్ఎన్.కవిత తదితరులు పాల్గొన్నారు.

గుత్తిఫోర్ట్ పేరును ఖరారు చేసిన రైల్వే అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

ధర్మవరం-గుత్తి సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వేస్టేషన్‌కు గుత్తి ఫోర్ట్ (గుత్తి కోట)గా పేరును ఖరారు చేశారు. అందుకు సంబంధించిన సర్క్యులర్‌ను గుంతకల్లు డివిజన్ కమర్షియల్ అధికారాలు గురువారం విడుదల చేశారు. బెంగుళూరు నుంచి ఎర్రగుంట్ల వైపునకు వెళ్లే గూడ్స్ రైళ్లు గుత్తి రైల్వేస్టేషన్ లోకి వచ్చి ఇంజన్ వ్యతిరేక దిశలో మార్చుకొని వెళ్లేవి. దీంతో రైల్వే అధికారులు సమయంతో పాటుగా డీజిల్ వృథా కాకూడదనే ఉద్దేశంతో గుత్తి రైల్ స్టేషన్‌కు సమీపంలో కర్నూలు రైల్వే గేట్ సమీపంలో బైపాస్ లైన్ నిర్మించారు. కడప జిల్లా ముద్దనూరు, ఎర్రగుంట్ల నుంచి సిమెంట్, బొగ్గు, ఇతర రవాణా చేసే గూడ్స్ లు గుత్తి స్టేషన్‌లోకి రాకుండా బైపాస్ మార్గంలో వెళ్లే విధంగా రూ.29 కోట్లతో నూతన స్టేషన్‌తో పాటుగా రైలు మార్గం నిర్మించారు. గతేడాది నవంబర్‌లో దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ గుత్తిలో పర్యటించి స్టేషన్ భవనంతో పాటుగా బైపాస్ మార్గంను ప్రారంభించారు. అయితే నూతన స్టేషన్‌కు గుత్తి పట్టణ వాసుల కోరిక మేరకు రైల్వే అధికారులు గుత్తి ఫోర్ట్‌గా నామకరణం చేస్తూ అనుమతి కోసం రైల్వే బోర్డుకు పంపారు. ఈ నేపథ్యంలో బుధవారం గుత్తి బైపాస్‌లో నిర్మించిన నూతన స్టేషన్‌కు గుత్తి ఫోర్ట్‌గా పేరును ఖరారు చేస్తూ రైల్వే బోర్డు పచ్చ జెండా ఇచ్చింది. గుత్తి నూతన స్టేషన్‌కు గుత్తి ఫోర్ట్ గా పేరు ఖరారు చేయడం పై గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. తమ పోరాటం ఫలించి గుత్తి ఫోర్ట్ పేరును అధికారులు ఖరారు చేయడం పై సంతోషం వ్యక్తం చేశారు.

అన్ని రంగాల్లో ఉరవకొండ అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ పంచాయతీ అభివృద్ధి పథంలో నడిచే విధంగా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఉరవకొండ పట్టణంలో రూ.10 లక్షల పంచాయతీ నిధులతో అధునాతన హైమాక్స్ లైట్లు ఏర్పాటుకు సర్పంచి లలితమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, జెడ్‌పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరీకరణలో భాగంగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్, బైపాస్, కనేకల్ క్రాస్ తదితర ప్రాంతాల్లో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.5 కోట్లతో సిసిరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఉదిరిపికొండ నుంచి త్వరలో పైపులైను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ ఉచిత తాగునీటి కుళాయిలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయించి ఉరవకొండ పంచాయతీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సీపీ.వీరన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఓబులేష్, కురుబ ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు మీరం బాషా, ఎస్సీ సెల్ నాయకులు బసవరాజు, మాజీ ఎంపిపి ఎసి ఎర్రిస్వామి, వార్డు సభ్యులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఇండేన్ గ్యాస్ మెకానిక్ ప్రసాద్

గ్యాస్ లీకేజీపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సిలిండర్లలో గ్యాస్ లీక్ అయినప్పుడు సొంతంగా మరమ్మతులు చేసి ప్రమాదాలకు తావివ్వరాదని ఇండేన్ గ్యాస్ మెకానిక్ ప్రసాద్ సూచించారు. పట్టణంలోని పార్వతి నగర్‌లో శ్రీదేవి ఎంటర్‌ప్రైజెస్ (ఇండేన్ గ్యాస్) ఆధ్వర్యంలో సేఫ్టీ క్లినిక్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గతంలో ఇళ్లలో ఉపయోగించిన కట్టెల పొయ్యిల వద్ద గ్యాస్ స్టవ్‌ను ఉంచరాదన్నారు. వంటలు చేసే సమయంలో నూనె, ఆహార పదార్థాలు లాంటివి స్టవ్‌కు సిలిండర్‌కు అనుసంధానంగా ఉండే పైపుపై పడకుండా చూడాలన్నారు. నూనె పైపుపై పడితే లీకేజీలు ఏర్పడే అవకాశం ఉంటుంది. తద్వారా మనకు తెలియకుండానే గ్యాస్ లీకేజీలు జరుగుతాయన్నారు. గ్యాస్ లీక్ అయినట్లు వాసన రాగానే ఇండేన్ గ్యాస్ సిబ్బందికి వినియోగదారులు తక్షణ సమాచారం ఇవ్వాలన్నారు. గ్యాస్ స్టవ్ సమీపంలో వెలుతురు, గాలి వచ్చేలా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. గ్యాస్ ఉపయోగం కంటే నిర్వహణ పద్ధతులు చాలా ముఖ్యమన్నారు. గ్యాస్ లీకేజ్‌లు ఏర్పడినప్పుడు పాటించాల్సిన మెలకువలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల చదువు కోసం తల్లి ఆరాటం..

చేయూత కోసం వేడుకోలు

ప్రజాశక్తి-అనంతపురం

జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. జీవితాంతం తోడు ఉంటాడనుకున్న భర్త క్యాన్సర్ మహమ్మరి కారణంగా ఒంటరిని చేసి వెళ్లాడు. ముగ్గురు అమ్మాయిలను జీవితంలో ముందుకు తీసుకెళ్లాలన్న దృఢ సంకల్పంతో గుండెను రాయి చేసుకుంది. నిరుపేదరాలు అయినా తన కష్టంతో ఆ పిల్లలను చదివిస్తోంది. పిల్లలను పోషించడంతో పాటు వారి చదువు బాధ్యత కూడా మీద పడడంతో అంతుచిక్కని అయోమయ స్థితిలో ఆ తల్లి ఆవేదన చెందుతోంది. అనంత ఆడపడుచు ఉష భర్త బ్లడ్ క్యాన్సర్‌తో చనిపోయాడు. తన ముగ్గురు కూతుళ్లతో బెంగళూరు మహా నగరంలో ఆమె అలుపెరుగని పోరాటం చేస్తోంది. 3వ తరగతి చదువుతున్న మోక్షిత, 9వ తరగతి చదువుతున్న షారెన్, పియుసి మొదటి సంవత్సరం చదువుతున్న దీప్తి ముగ్గురూ చదువులో రాణిస్తున్నారు. కానీ వారి తండ్రి అకాల మరణంతో పిల్లల భవిషత్తు ప్రశ్నార్థకం అయింది. ముగ్గురి పిల్లల చదువు ఖర్చు దాదాపు 60 వేలు అవుతుంది. ఇంటి పనులు చేస్తున్న ఉషకు వారిని పోషించడమే కష్టం. తన పుట్టినిల్లు అనంతపురం వచ్చి పలువురిని సాయం కోరుతోంది. దాతలు ముందుకు వచ్చి తన బిడ్డలను చదివించాలన్న ఆ తల్లి దృఢ సంకల్పానికి చేయూతను అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఉష ఫోన్ పే, గూగుల్ పే నెంబరు 8123201366. బ్యాంకు అకౌంట్ నెంబరు 009110100035429, ఐఎఫ్ఎస్‌సి యుబిఐఎన్ 0800911.



పిల్లలతో ఉష

కేశవ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌పై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి సూచించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కేశవ్ అడ్డుపడుతున్నాడని అసత్య ప్రచారాలు చేస్తూ కాలం గడపడం మానుకుని, అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. గతంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు దొంగ పట్టాలని చెబుతున్నారని, తమ పోరాటాల కృషి వల్లనే పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారని మీరు మాట్లాడలేదా అని ప్రశ్నించారు. కోనాపురం చెరువుకు నీరురాకుండా ఆపింది వైసిపి ప్రభుత్వం కాదా అని ఎద్దేవా చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలల్లో స్వార్థ రాజకీయాల కోసం చిచ్చుపెట్టే విధంగా మాట్లాడడం మానుకోవాలన్నారు. ఉరవకొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి పయ్యావుల సోదరులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉరవకొండ మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, ఎస్సీసెల్ మండల నాయకులు వరప్రసాద్, మాజీ సర్పంచి వెంకటేసులు, రాంబాబు, చాబాల మాజీ సర్పంచి ఎర్రిస్వామి, వార్డు మెంబర్ రామాంజనేయులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలో వివిధ గ్రామాల రైతుల వ్యవసాయ పొలాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి గురువారం వినతి చేశారు. వారం రోజులుగా వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. రాత్రి వేళల్లో త్రీ ఫేజ్ ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు సౌకర్యంగా ఉండే విధంగా పగటి పూట కనీసం 8 గంటలు త్రీ ఫేజ్ విద్యుత్ వదలాలని విశ్వేశ్వర్‌రెడ్డి అధికారులకు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బసన్న, మండల జెఎసి కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత మంచినీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పాల్తూరు గ్రామ సర్పంచి బ్యూలా రాణి రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ పంచాయతీ జి.మల్లాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పైపులైన్ పనులను గురువారం చేపట్టారు. త్వరలోనే పైపులైన్ పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వున్నారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, వన్నారెడ్డి, శంకర్ గౌడ్, కావలి చంద్ర, కావలి వెకటేష్, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-ఉరవకొండ

పరిమితికి మించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెవిఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉరవకొండ పట్టణంలో రవాణా శాఖ, ఆర్‌టిసి అధికారులు సంయుక్తంగా బళ్లారి-అనంతపురం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నామని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగివుండాలన్నారు. నిబంధనల ప్రకారమే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకి తరలించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ నంబర్లు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.కార్యక్రమంలో స్థానిక ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వాటర్ సప్లై కార్మికులు

జీతాలు ఇవ్వకపోతే బతికేదెలా..?

ప్రజాశక్తి-ఉరవకొండ

నెలల తరబడి చేసిన పనులకు జీతాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలు బతికేది ఎలా? అని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామంలోని సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు పంప్‌హౌస్ ఎదుట కార్మికులు 9వ రోజూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత ఏడాది సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, పెండింగ్ గ్రాడ్యుటీ ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. తొమ్మిది రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులకు, కాంట్రాక్టర్లకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఈనెల 15వ తేదీ నుంచి సిఐటియు పిలుపుమేరకు సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మల్లికార్జున, మల్లన్న, ధనుంజయ, సూరి, మర్రిస్వామి, వి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో
ఏపీ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత

ప్రజాశక్తి-నార్పల

గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వాచనాలు తెలిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిఎం కావాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు హరిత రాజగోపాల్ తెలిపారు. తిరుగు ప్రయాణంలో వారు నార్పల మండల కేంద్రంలో ఇటీవల ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న బండారు నగేశ్ ను కళాకారుల కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, చెన్నంపల్లి శ్రీరాములు, లక్ష్మినారాయణ, ప్రభుదాస్, ప్రదీప్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో విద్యార్థులకు విద్య దూరం

ప్రజాశక్తి-రాయదుర్గం

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీసెల్ అధికార ప్రతినిధి పోరాళ్ల సురేంద్ర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. విదేశీ విద్య పథకాన్ని దూరం చేసి నిరుపేద విద్యార్థులను మోసం చేస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేశారని గుర్తుచేశారు. విదేశీ విద్య పథకంలో నిబంధనలను తొలగించి నిరుపేద విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వరుణ్

ప్రజాశక్తి-నార్పల

కార్యకర్తల సంక్షేమమే జనసేన పార్టీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ అన్నారు. ఇటీవల మరణించిన నార్పల మండల కేంద్రానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త నీలూరు నారాయణస్వామి కుటుంబ సభ్యులకు వారు గురువారం రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేశారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చిలకం మధుసూదన్‌రెడ్డి, టిసి.వరుణ్ చేతుల మీదుగా మృతుడి భార్య జయంతికి డబ్బును అందజేశారు. ఆ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసేన కార్యకర్తలు క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమను గుర్తుపెట్టుకుని ఆర్థిక సాయం అందజేసిన పవణ్ కళ్యాణ్‌కు, జనసేన నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటామని మృతుడి భార్య జయంతి కన్నీటిపర్యంతమై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాంతీయ వీర మహిళ పసుపులేటి పద్మావతి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, పార్టీ నార్పల మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు, ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు తుపాకుల భాస్కర్, విశ్వనాధ్ రెడ్డి, నారాయణ స్వామి, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శింగనమల సెంటిమెంట్ నడుస్తోంది..

ఏపీ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-యల్లనూరు



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

'1975 నుంచి మన రాష్ట్రంలో ఒక సెంటిమెంటు నడుస్తోంది.. శింగనమల నియోజకవర్గంలో ఏ పార్టీ ఎమ్మెల్యే అయితే గెలుస్తారో...ఆ పార్టీయే అధికారంలోకి వస్తుంది'..అని ఏపీ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. యల్లనూరు మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శింగనమల సెంటిమెంట్ ప్రతి ఎన్నికల్లో రుజువైందని అన్నారు. 2019లో శింగనమలలో పద్మమ్మను గెలిపించారని, రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పాటైందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా మనందరం ఏకతాటిపై నిలిచి పనిచేద్దామని, శింగనమల సెంటిమెంట్‌ను నిజం చేద్దామని అన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. గత పదేళ్లుగా ఎన్ని ఇబ్బందులున్నా తమ వెనుకే ఉండి ముందుకు నడిపిస్తున్న శింగనమల నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీపీ గంగాదేవి, జెడ్‌పిటిసి భోగతి ప్రతాప్ రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ కిరణ్, ఎంపీటీసీలు, సర్పంచులు, రామాంజులరెడ్డి, వైసీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.